# *కంఠహారము

'ఆనంద'

౧

ఆమె లేమికి కలిగిన బిడ్డ. విధివిధానమున బీదల ఇండ్లలో పడిన అందగత్తె. కట్నము లేదు; కానుక లేదు. ఎఱుక లేదు; వినికి లేదు. తెలిసినవారు లేరు; తెలిసికొనువారు లేరు. ధనవంతులామెకడ ప్రేమ భిక్షను గైకొనగోరిన ట్లగపడదు. కాన ఆమెయే ప్రయత్నించి ఒకనిని పెండ్లియాడెను.

విలువగల వలువలగట్ట వీలు లేనందున ఆమె స్వల్పములగు వలువల దాల్చినది; వానితోపాటు ప్రపంచము నందుండు హీనత్వమునుగూడ.

ధనవంతుల ఇండ్లబడలేదని ఆమెకుందు. గృహమును చూచిన అమెకు మంట. విరిగిపోయినకుర్చీ, అలంకారశూన్యమగు గోడలు—ఇవి ఆమెమంట నినుమడింప చేయుచుండెను. తీయటికలలను గనుచుండెడిది. రత్నకంబళములు, అలంకారములు, సేవకులు—వీనిమధ్య ఆమె ఊహాప్రపంచమున మెలగెడిది.

భోజనముకడ కూర్చొనినపుడు ఆమెప్రాణములు నిలువున పోయెడివి. ధనికులు తిను పంచభక్ష్యపరమాన్నముల దలచి ఉఱ్ఱూత లూగెడిది; లొట్టలు వేసెడిది.

ధరింప నుపయోగపడెడివన్నియు ఆమె తనకుగా కోరుకొనెడిది.

౨

ఒకరోజున ఆమెభర్త కవరు నొకదానిని కొని వచ్చి యిచ్చెను. ఆమె చింపి చూచి ఇట్లు చదివికొనెను.—

"మాయింట జరుగబోవు విందునకు మీరు కుటుంబసహితముగ వచ్చెదిరని నమ్ముచున్నాము. సోమవారము రాత్రి యెనిమిదిగంటలన్నరకు, సరిగ."

తహసిల్దారు కడనుండి వచ్చిన ఈ ఆహ్వానమును గాంచి ఆమె సంతసించునని ఆతని తలంపు.

ఆమె మండిపడెను. "దీనితో నేమి చేయను?" అని ఆమె తీంగ్రించెను.

"నీవు సంతసించెద వనుకొంటిని. గొప్పవారందరటకు వచ్చెదరు."

"ఏ మొగముతో నే నటకేగను? ధరింప—"

అతని కది తట్టలేదు.

"నీవు నాటకమున కేగువానితో—" అని అతడు తలయెత్తి చూచెను. కనుకొలుకులనుండి కన్నీటిచుక్కలు ముత్తెములవలె జారుచుండెను.

అత డామె నతికష్టమున ఓదార్చెను.

"నీ వలువల కెంత యగును?" అని ఆతడు ప్రశ్నించెను.

ఆమె ఆలోచించి ఆలోచించి, ఎంచి ఎంచి, "నూటయేబది,—రెండువందలగును" అని చెప్పెను.

అతడు తెల్లపోయెను. "చూచెద"ననెను.

3

వలువలు వచ్చినను ఆమెమోము వికసింపలేదు.

"ఇటు లుంటివేమి?" అని అతడు ప్రశ్నించెను.

"ధరింప నగలు లేమి" అని.

"సహజములగు ఆభరణములు, పూలు ధరింప బాగుగ నుండును."

ఆమె కిసుమంతయు ఇష్టము లేదు.

"ధనవంతుల యెదుట నాదారిద్ర్యమును వెల్లడింప దలప లేదు."

---

* గైడె మొపసెంట్ నుండి.

“నీహితురాలు సుధకడ కరిగి నగల నడుగ రాదా!? ఆమెకడ నీ కామాత్రము చనవు కలదు.”

“నాకు తట్టలేదు.”

ఆమె హితురాలికడ కరిగి తనకష్టమును వెలిబుచ్చుకొనెను. హితురాలు పడకగదిలోని కేగి నగల పెట్టెను తీసికొనివచ్చి,

“నీ ఇష్టము వచ్చిన వానిని తీసికొనుము” అనెను.

మొదట గాజులను తీసికొనెను. తరువాత తారహారము; బంగారు గొలుసు.

వానిని ఆమె అలంకరించుకొని అద్దముముందర నిలబడెను.

“ఇంకేమియు లేవా?”

“నీవే చూచుకొనుము.”

తదుపరి చిన్న పెట్టె ఒకటి కనబడెను. అందులో రత్నహార మొకటి ఉండెను.

దానిని చూచినతోడనే ఆమె ఉత్సాహ మినుమడించెను. మనసు దానిని కోరెను. చేతులు వడకెను. అప్రయత్నముగా చేతులు దానిని తీసి మెడలో వైచినవి.

“దీనిని......”

“అటులనే!”

సంతోషమున ఆమె తనహితురాలిని కౌగిలించుకొనెను.

## ౪

విందురోజు వచ్చినది. ఆమెకు విజయము ఆరోజున—అలంకరణమున. ఆమెయే ఉన్నవా రందరిలో అందమున మిన్న; అలంకరణమునకూడ. ఆమెచిఱునవ్వును ఒక గర్వరేఖ ఆవరించినది. అందరును ఆమెతో మాటాడగోరువారె; ఆమెపేరును తెలియ గోరువారే.

భోజనము లయినవి.

ఆమెభర్త ఆమెకొఱకు వచ్చెను. బండి నొకదానిని కట్టించుకొని ఇంటికి చేరుకొనిరి. పది ఆయెను.

ఒకసారి పండుకొనబోవుముందు తన సుందరరూపమును దర్పణమున చూచుకొన దలచెను. అద్దముముందర నిలబడి కెవ్వన కేకవైచెను. రత్నహారము కంఠమున లేదు.

“ఏమి?” అని చొక్కా నూడదీసికొనుచు ఆమె భర్త అడిగెను.

“హారము మాయమయినది.”

“ఓ, అది ఎక్కడనో ఇక్కడే పడిఉండును.”

ఆమె చీరచెరగున బడెనేమో యని చూచెను.

“బయటకు వచ్చినపుడు — భోజనముచేసి— ఉన్నదా?”

“ఆ, అప్పుడు దానిని తడిమి చూచుకొంటిని.”

“అది క్రింద పడియుండదు. పడిన చప్పుడైయుండును. బహుశా, బండిలో పడియుండ వచ్చును.”

“పడియుండవచ్చును. బండివాని నెరుగుదురా?”

“ఎరుగను—నీవో?”

“ఎరుగను.”

వారొకరి నొకరు చూచుకొనిరి; మోములు వెల్లబడినవి.

అతడు మరల చొక్కా తొడుగుకొనుచు “బయటకు వెళ్లి ఎక్కడనైన అగపడునేమో చూచివచ్చెదను” అని బయటకు వెళ్లెను.

ఆమె ఒక కుర్చీలో కూలబడెను. రెండైనది. అతడు వచ్చినాడు, దొరకలేదు.

“హారము అతుకు ఊడినది. బాగుచేయింప కంసాలికడ కంపినాను. త్వరలో పంపెదను” అని ఆమె స్నేహితురాలికి మరునాడు కబురంపెను.

## ౫

వారము రోజులు గడచినవి జాడ లేదు. దాని బదులు ఇంకొకదానినైన ఈయవలయును.

అతడు రత్నహార ముంపబడిన పెట్టెను చేతిలో నిడికొని చూచుచుండెను. దానిమీద కంపెనీపేరు మెరయుచుండెను.

అతని హృదయాకాశమున ఆశాతటిత్తు ఒకటి మెరసినది.

ఆపెట్టెను చేత నిడికొని ఆకంపెనీ కరిగినా డాతడు. హారమును గురించి అడుగ "నేను దానిని అమ్మ లేదు. పెట్టెమాత్రమే అమ్మితిని" అనెను.

అతడు తిరగని దుకాణమే లేదు. ఎక్కడను దానిని పోలిన హార మగపడలేదు.

ఒకచోట దానిని పోలిన దగపడినది! దాని ఖరీదు రెండువేలు!

"కావలసిన పదునెనిమిదివందల కిత్తుము" అని వారనిరి.

"రెండు రోజులవరకు దానిని అమ్మవలదు" అని అతడు వారి నడిగెను.

చీమవలె కూడబెట్టినవి ఐదువందల రూపాయ లాతనికడ గలవు. మిగిలిన పదమూడువందలను పలు చోట్ల అప్పుచేసి పదునెనిమిదివందల రూప్యముల పోగు చేసెను.

సాహసము!

ఆతని భవిష్యజ్జీవితము భారము.

హారమును పెట్టెలో పెట్టి, హృదయము సంస్పందించుచుండ, హితురాలి కడ కరిగి ఆమెచేత నిడెను.

"త్వరగా ఈయవలసినది. నాకవసరము కలిగినది" అని ఆమెచల్లగా నంటించెను.

ఆమె, పెట్టె తెరచి చూచునని భయపడినది. కాని చూడలేదు. చూచినచో ఆమె ఏమని తలంచెడిది!

## ౬

ఆమెకును బీదతనమునకును చెలిమి బాగుగా కలిగినది. అప్పటికిని ఆమె ధీర. అప్పువయ్యమును వదల్చుకొనవలె. పనిచేసెడి దాసీకి స్వస్తి మొదట. ఖర్చు కుంచింప ఇల్లు మార్చిరి. నెలకు మూడు రూపాయలనిచ్చి ఒకగదిని అద్దెకు గైకొనిరి. ఆమె ఇల్లూడ్చెడిది; అంట్లు తోమెడిది; చెంబులు తోలచెడిది; బట్టలు పిండి ఎండవైచెడిది; నీళ్లు తోడెడిది, రోజుచు.

అప్పుడప్పుడు పాత అప్పుల దీర్చ క్రొత్తవి సాయపడెడివి. అతడు పగటిపూట తాలూకా-కచ్చేరీలో పనిచేసెడివాడు. రాత్రి పత్రికలకు వ్యాసముల వ్రాసి డబ్బు సంపాదించెడివాడు ఇం దాతనికి పేరువచ్చినది. పేజీ కొకరూపాయి. పదిసంవత్సరము లిట్లు గడచినవి. వారి అప్పు వడ్డీతో సహా తీరినది.

ఆమె ఇప్పుడు ముసలితనమున మసలుచున్నది. ఈ ముసలితనమును లేమి అప్పగించినది. ఎంతభేదము! మాటలో, నడకలో. ఉనికి మనుకులలో కూడ. మృదుత్వము పోయినది! భీమరత వచ్చినది! మోటు తేలినది మనిషి! అందము నశించినది! కృశించినది!

పనిలేనప్పుడు ఆమె కిటికీలో కూర్చొని తాను సౌందర్యాధిదేవతగా నెన్నబడిన రోజులు తలంచెడిది.

హారము పోకున్నచో—? ఎవరు చెప్పగలరు!

ఎంతక్షణభంగురత!

## ౭

సాయంకాల మయినది. ఆమె కిటికీలో కూర్చుని యుండెను. ఆదారినుండి ఆమెహితురాలరుగుచుండెను. ఆమెను చూచి చాలకాలమయినది!

ఒండొరుల చూపులు కలసికొనినవి. హితురాలు గుర్తించలేదు. ఆమెకు పలుకరింప మతి. "సుధా" అని కేకవైచినది. గబగబ తలుపు తీసినది. ఆమెను పిలిచినది, 'లోనికి రా.'

ఆమె, "నేను నిన్నెరుగనే, నీవు పొరబడితి వేమో?" అనెను.

"లేదు. నా పేరు..."

"ఆ!" అని హితుగా లచ్చెరువందెను.

"ఇటుల మారితివేమి!"

"నీవలననే! జీవితము దుర్భరమయినది."

"ఏమి?"

"ఆరోజున నాకు విందునకు ఇచ్చితివి, హారము. జ్ఞాపక మున్నదా?"

"ఆ."

"అది పోయినది."

"నాకు తెచ్చి ఇచ్చితివే."

"ఇంకొకదానిని కొని ఇచ్చితిమి, సరిగ అటు లనే యుండుదానిని. దానికై చేసిన అప్పును పదివత్సర ములనుండి తీర్చుచుంటిమి. మాబోటి బీదలను గురించి నీకు చెప్పనక్కర లేదు. ఇప్పుడు తీరినది."

"దాని బదులుగా నొకరత్నహారము నిచ్చితివా?"

"నీవు గ్రహించలేదు—కాదా? రెండును ఒక మాదిరిగనే యున్నవి."

సుధ కరగిపోయినది.

ఆమెను కౌగిలించుకొనినది.

"నేను నీ కిచ్చినహారము ఇమిటేషన్ రాళ్లది. మహా ఉండిన పాతిక రూపాయ లుండును, దాని ఖరీదు."



కోరుకొండ దేవాలయ శిల్పము